తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్
సోమవారం
19 అక్టోబర్ 2026
పేజీలు : 08







# ట్యాంక్‌బండ్‌పై బతుకమ్మ సంబురం

## పూల పరిమళం.. జానపద కళల వైభవం.. పూల పండుగకు సినీ సోయగం

- తెలంగాణ సంస్కృతికి ట్యాంక్‌బండ్ నీరాజనం
- సద్దుల బతుకమ్మ సంబరాల్లో ప్రత్యేక ఆకర్షణగా విజయ్ దేవరకొండ-రష్మిక దంపతులు
- 700 మంది కళాకారుల ప్రదర్శనలు.. వెయ్యి బతుకమ్మలతో అద్భుత శోభ

*తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, రాష్ట్ర సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ వేడుకలు హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై ఆదివారం అంగరంగ వైభవంగా జరిగాయి. హుస్సేన్‌సాగర్ తీరం పూల సోయగాలు, సంప్రదాయ పాటలు, జానపద కళారూపాలతో పండుగ శోభను సంతరించుకుంది. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు గవర్నర్ శివప్రతాప్ శుక్లా దంపతులు, మంత్రులు జూపల్లి కృష్ణారావు, సీతక్కతో పాటు పలువురు ప్రముఖులు హాజరయ్యారు.*

హైదరాబాద్, అక్టోబర్ 18 (జనం సాక్షి):



సినీ నటులు విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న దంపతులు వేడుకల్లో పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. తెలంగాణ కోడలిగా సద్దుల బతుకమ్మ వేడుకల్లో పాల్గొనడం ఆనందంగా ఉందని రష్మిక పేర్కొన్నారు. సినీ తారల రాకతో అభిమానుల్లో ఉత్సాహం నెలకొంది. సంప్రదాయ పూల పండుగకు సినీ రంగం తోడవడంతో వేడుకలకు మరింత ప్రత్యేకత చేకూరింది.

### 700 మంది కళాకారులతో సాంస్కృతిక వైభవం

తెలంగాణ పల్లె సంస్కృతి, జానపద కళలను ప్రతిబింబించేలా సుమారు 700 మంది కళాకారులు 30 సంప్రదాయ కళారూపాలను ప్రదర్శించారు. పేరిణి నృత్యం, గుస్సాడీ, ఒగ్గుడోలు, డప్పు కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మహిళలు, యువతులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి సంప్రదాయ పాటలు పాడుతూ కోలాటాలతో సందడి చేశారు.

### వెయ్యి బతుకమ్మలతో కనువిందు

మహనీయుల స్మారక స్థూపం నుంచి ట్యాంక్‌బండ్ వరకు సుమారు వెయ్యి బతుకమ్మలతో నిర్వహించిన ఊరేగింపు వేడుకలకు ప్రత్యేక శోభను తీసుకొచ్చింది. విద్యుద్దీపాల అలంకరణలు, భారీ ఎల్ఈడీ తెరలు, లేజర్ షో, బాణసంచా ప్రదర్శనలు సందర్శకులను ఆకట్టుకున్నాయి.



### ప్రకృతిని కాపాడుకోవాలి: గవర్నర్

బతుకమ్మ తెలంగాణ సాంస్కృతిక వారసత్వానికి, మహిళా సాధికారతకు, ప్రకృతిపై గౌరవానికి ప్రతీక అని గవర్నర్ శివప్రతాప్ శుక్లా పేర్కొన్నారు. నీటి వనరుల పరిరక్షణ, వర్షపు నీటి సంరక్షణ, సహజ వనరులను కాపాడుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. కులమతాలకు అతీతంగా ప్రజలను ఏకం చేసే బతుకమ్మ పండుగ తెలంగాణ అస్తిత్వాన్ని చాటిచెప్పిందని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. జానపద కళలను పరిరక్షిస్తూ భావితరాలకు రాష్ట్ర సంప్రదాయాలను అందించాలని మంత్రి సీతక్క ఆకాంక్షించారు.
తెలంగాణ మట్టి పరిమళం, పూల అందం, జానపద కళల వైభవం కలగలిసిన సద్దుల బతుకమ్మ వేడుకలు రాష్ట్ర సాంస్కృతిక ఐక్యతను మరోసారి చాటిచెప్పాయి.






లోపలి పేజీలో

## దుర్గమ్మ కరుణ కటాక్షాలు ప్రజలందరిపై ఉండాలి

బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్

## కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు



కీసర, అక్టోబర్ 18 (జనంసాక్షి) : అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు ఆకాంక్షించారు. నాగారం డివిజన్ పరిధి లోని శివానందపురి కాలనీలోని శ్రీ కనకదుర్గ

లోపలి పేజీలో

కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు అతీతంగా..

## కుల సమీకరణాల చుట్టూ రాజకీయం

తెరపైకి కొత్త చర్చ..
నేతల కలయికలతో కార్యకర్తల్లో గుబులు

- 'మేమంతా జెండాలు మోసింది ఇందుకేనా?' అంటూ అంతర్మథనం!



లోపలి పేజీలో



# ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

### ఒకే తాటిపైకి వచ్చిన మహిళలు..

### ఆటపాటలతో సందడిగా బతుకమ్మ సంబరాలు

**హైదరాబాద్ (జనంసాక్షి) :** మహిళలంతా ఒక్కచోట చేరి సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మల చుట్టూ మహిళలు ఒకే తాటిపైకి వచ్చి బతుకమ్మ పాటలు పాడుతూ, ఆటపాటలతో ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. సంప్రదాయ దుస్తులు ధరించి, ఆనందోత్సాహాల మధ్య బతుకమ్మ ఆడుతూ పండుగ సందడిని రెట్టింపు చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలంతా ఐక్యంగా జరుపుకోవడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ వేడుకలతో ఆయా ప్రాంతాల్లో పండుగ వాతావరణం నెలకొంది.

# దుప్పట్లు, స్వెటర్ల పంపిణీ



**హైదరాబాద్ (జనంసాక్షి) :** నగరంలోని రోడ్ల పక్కన, ఫుట్‌పాత్‌లపై జీవనం సాగిస్తున్న అనాథలు, నిరాశ్రయులు చలికాలంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి దుప్పట్లు, స్వెటర్లను పంపిణీ చేసింది స్పై ఫౌండేషన్. చలికి రక్షణ లేక ఇబ్బందులు పడుతున్న అభాగ్యులు స్పై ఫౌండేషన్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్పై ఫౌండేషన్ ప్రెసిడెంట్ వై. సంజీవ కుమార్, వైస్ ప్రెసిడెంట్ ఓ. పావని పాల్గొన్నారు. అవసరం ఉన్నవారికి అండగా నిలవాలనే ఆశయంతో ప్రతి ఆదివారం విభిన్న కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

## మోత్కూర్ దళితవాడలో దుర్గామాత సన్నిధిలో బోనాలు



**దోమ అక్టోబర్ 18 జనం సాక్షి :** వికారాబాద్ జిల్లా దోమ మండల పరిధిలోని మోత్కూర్ దళితవాడలో దుర్గామాత సన్నిధిలో బోనాల పండుగ ఘనంగా జరుపుకున్నారు. మహిళలు భక్తి శ్రద్ధలతో బోనాలు ఎత్తుకొని అమ్మవారి చుట్టూ ప్రదర్శనలు చేశారు. ఈ కార్యక్రమంలో మోత్కూర్ గ్రామ పెద్దలు, గ్రామస్తులు కాలనీవాసులు కమిటీ మెంబర్స్, అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# సద్దుల బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న కంకణాల కుటుంబ సభ్యులు



**కూకట్‌పల్లి, అక్టోబర్ 18(జనంసాక్షి):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో కంకణాల కుటుంబ సభ్యులు పాల్గొని బతుకమ్మ సంబరాలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ పాటలతో సందడి చేశారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ఐక్యతకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను కుటుంబ సభ్యులతో కలిసి జరుపుకోవడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో ఇటువంటి పండుగలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.

# బతుకమ్మ సంబరాల్లో ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సందడి

**మిడ్జిల్ అక్టోబర్ 18 (జనంసాక్షి) :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ ముగింపు వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. గత వారం రోజులుగా సద్దుల బతుకమ్మ కార్యక్రమం వ్యవస్థాపక అధ్యక్షుడు బార్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు అత్యంత ఘనంగా నిర్వహించబడుతున్నాయి. ఈ వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమానికి ఎమ్మెల్యే జె. అనిరుధ్ రెడ్డి విచ్చేశారు. ఆయనతో పాటు వారి మాతృమూర్తి శశికళ రెడ్డి కూడా ఈ సంబరాల్లో పాల్గొన్నారు. ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ బృందాలు (టీములు), మహిళల దగ్గరకు ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి స్వయంగా వెళ్లారు. ప్రతి ఒక్కరి బతుకమ్మలను, ఆటపాటలను ఆసక్తిగా తిలకించిన ఆయన, మహిళల ఉత్సాహాన్ని



అభినందిస్తూ వారందరికీ ప్రత్యేకంగా బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.





# ఆల్టిమెట్రిక్ 'హెల్త్‌కేర్, లైఫ్ సైన్సెస్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' ప్రారంభం

### వారం రోజుల్లోనే ఏఐ వర్క్‌ఫ్లో అందించే 'ఫార్మాఓఎస్' ఆవిష్కరణ

**హైదరాబాద్, అక్టోబర్ 18 (జనంసాక్షి) :** ప్రముఖ కృత్రిమ మేధ (ఏఐ) ఇంజనీరింగ్ సంస్థ ఆల్టిమెట్రిక్ హెల్త్‌కేర్, లైఫ్ సైన్సెస్ రంగాల్లో ఏఐ ఆధారిత ఆవిష్కరణలు వేగవంతం చేసేందుకు గచ్చిబౌలిలోని తన ప్రాంగణంలో 'హెల్త్‌కేర్, లైఫ్ సైన్సెస్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' ప్రారంభించింది. ఈ కేంద్రం ద్వారా తన మొట్టమొదటి 'ఫార్మాఓఎస్' అనే ఏజెంటిక్ ఏఐ ప్లాట్‌ఫామ్‌ను విడుదల చేసింది. ఆల్టిమెట్రిక్ ఏఎల్టీఐ ఏఐఓఎస్ ఫ్రేమ్‌వర్క్‌పై రూపొందించిన ఈ 'ఏజెంటిక్ ఏఐ ప్లాట్‌ఫామ్'తో పాటు పరిశ్రమలోని క్లయింట్లతో కలిసి భవిష్యత్తులో మరిన్ని సేవలను అభివృద్ధి చేయనుంది. ఫార్మాఓఎస్ సహాయంతో క్లయింట్లు ఒక నిర్దిష్ట ఆలోచన నుంచి ధ్రువీకరించబడిన, నియంత్రిత ఏఐ ఏజెంటిక్ వర్క్‌ఫ్లో స్థాయికి కేవలం ఒకే వారంలో చేరుకోవచ్చని, తద్వారా సంస్థలు ప్రాథమిక ఆలోచనను వేగంగా ఉపయోగపడే విధంగా మార్చుకోవచ్చని కేంద్రం తెలిపింది. రెగ్యులేటరీ నిబంధనలకు అనుగుణంగా ఉంటూ ప్రతి ఫలితాన్ని నమ్మకమైన మూలాలతో సరి చూస్తూ, తీసుకునే నిర్ణయాలకు మానవ జవాబుదారీతనాన్ని నిర్ధారించే విధంగా కృత్రిమ మేధ ఏజెంట్లను రూపొందించేందుకు ఏఐ ఇంజనీర్లు, లైఫ్ సైన్సెస్ నిపుణులను ఇది ఒకే వేదికపైకి తీసుకువస్తుంది. హైటెక్ సిటీ సమీపంలోని గచ్చిబౌలి, ఫీనిక్స్ ఈక్వినాక్స్‌లో 300 మందికి పైగా ఉద్యోగులతో ఉన్న



ఆల్టిమెట్రిక్ 22,000 చదరపు అడుగుల కార్యాలయంలో ఈ కేంద్రం ఏర్పాటైంది. ఔషధాల ఆవిష్కరణ, క్లినికల్ డెవలప్‌మెంట్, వాణిజ్య కార్యకలాపాలు, తయారీ రంగం, రోగుల అనుసంధానం, ఆరోగ్య సంరక్షణ విభాగాలలో ఈ కేంద్రం సేవలు అందించనుంది.

ఈ సందర్భంగా ఆల్టిమెట్రిక్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రాజ్ సుందరేశన్ మాట్లాడుతూ సంస్థలు అర్థవంతమైన ఫలితాలను అందించే కృత్రిమ మేధను కోరుకుంటున్నాయన్నారు. హెల్త్‌కేర్, లైఫ్ సైన్సెస్ రంగాలలో పరిశ్రమల నేపథ్యం, రెగ్యులేటరీ నిబంధనలు, విశ్వసనీయ డేటా ఆధారంగా పరిష్కారాలు రూపొందించడమేనన్నారు. మా హెల్త్‌కేర్ & లైఫ్ సైన్సెస్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ నుంచి వస్తున్న మొట్టమొదటి ఉత్పత్తి 'ఫార్మాఓఎస్' అన్నారు. కీలకమైన పని విధానాలలో నియంత్రిత ఏఐ ఏజెంట్లను నిర్మించడానికి, విస్తరించడానికి గ్లోబల్ కస్టమర్లకు సహాయపడేలా దీనిని రూపొందించామని తెలిపారు. హైదరాబాద్‌లోని అపారమైన ఫార్మా నైపుణ్యం, సాంకేతిక ప్రతిభ ఈ కేంద్రానికి సరైన వేదికగా నిలవనుందన్నారు. ఆచరణాత్మక, పరిశ్రమ నిర్దిష్ట ఆవిష్కరణలను అందించడానికి అవసరమైన సామర్థ్యాలను ఇది ఏకతాటిపైకి తెస్తుందన్నారు. ఆల్టిమెట్రిక్ హెల్త్‌కేర్, లైఫ్ సైన్సెస్ విభాగాధిపతి రామ్‌జీ వాసుదేవన్ మాట్లాడుతూ హెల్త్‌కేర్, లైఫ్ సైన్సెస్ విభాగాలలో సంస్థలు రోగుల భద్రత లేదా నిబంధనల విషయంలో ఎక్కడా రాజీ పడకుండా వేగంగా ముందుకు సాగాలన్నారు. దానరిక్స్ సహ-వ్యవస్థాపకుడు, గ్లోబల్ హెల్త్‌కేర్ ఫార్మా లీడర్ డాక్టర్ వివేక్ రూప మాట్లాడుతూ ఫార్మా రంగంలో ఆధారాలపై విశ్వాసాన్ని, నిర్ణయాలలో జవాబుదారీతనాన్ని నిలుపుకుంటూనే మన బృందాలు మరింత వేగంగా పని చేసేలా చేయడంలోనే ఏఐ నిజమైన విలువ దాగి ఉందన్నారు. రోగుల సంరక్షణను, ఫలితాలను మెరుగుపరచడమనే హెల్త్‌కేర్, లైఫ్ సైన్సెస్ రంగాల విస్తృత ప్రయోజనానికి ఉపయోగపడేలా సాంకేతికతపై నమ్మకాన్ని పెంపొందిస్తుందని తెలిపారు.

# జూనియర్ సివిల్ జడ్జిగా గంట మనీష్

### హర్షం వ్యక్తంచేసిన సబ్జీమండి గంగపుత్ర సంఘం నాయకులు

**హైదరాబాద్ (జనంసాక్షి) :** సబ్జీమండి గంగపుత్ర సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి, కీర్తిశేషులు గంట నరేష్ – రుక్మిణి దంపతుల రెండో కుమారుడు గంట మనీష్ జూనియర్ సివిల్ జడ్జిగా నియమితులు కావడం పట్ల సబ్జీమండి గంగపుత్ర సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. పట్టుదల, కృషి, తండ్రి ఆశయాల సాధనకు అంకితభావంతో ముందుకు సాగిన మనీష్ న్యాయమూర్తిగా ఎంపిక కావడం గంగపుత్ర సమాజానికి గర్వకారణమని వారు పేర్కొన్నారు. సామాజికంగా, విద్యాపరంగా



ఉన్నత స్థానాలను అధిరోహించాలనే యువతకు గంట మనీష్ విజయం స్ఫూర్తిదాయకమని అభిప్రాయపడ్డారు. ఆయన సాధించిన ఈ ఘనత తమ సంఘానికి ఎంతో ఆనందాన్ని, గర్వాన్ని కలిగించిందని తెలిపారు. ఈ సందర్భంగా మనీష్‌కు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులో న్యాయరంగంలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, ప్రజలకు న్యాయసేవలు అందిస్తూ మంచి పేరు సంపాదించాలని ఆకాంక్షించారు. ఈ మేరకు హర్షం వ్యక్తం చేసిన వారిలో సబ్జీమండి గంగపుత్ర సంఘం అధ్యక్షుడు దోర్నల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఆనందేసి వేణుబాబు, ఉపాధ్యక్షులు నాస నర్సింగ్ రావు, గుడిమణి కేశవులు, ఆర్.కె. భగవాన్, ఆర్.కె. మైసయ్య, కె. అంజయ్య, జి. హరిచరణ్ తదితరులు ఉన్నారు.

# వజ్రేష్ యాదవ్ బర్త్ డే సందర్భంగా..
# పేద ముస్లిం కుటుంబాలకు నిత్యావసర సరుకుల పంపిణీ



**బోడుప్పల్-జనంసాక్షి**

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీ తోటకూర వజ్రేష్ యాదవ్ జన్మదినాన్ని పురస్కరించుకుని, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బోడుప్పల్ సర్కిల్, చెంగిచర్ల డివిజన్ కాంగ్రెస్ పార్టీ మైనారిటీ అధ్యక్షులు మొహమ్మద్ యాకూబ్ ఆధ్వర్యంలో శ్రీ తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ గార్ల చేతుల మీదుగా పేద ముస్లిం కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తోటకూర వజ్రేష్ యాదవ్ గారు మాట్లాడుతూ.. "నా జన్మదినాన్ని పురస్కరించుకుని పేద ముస్లిం కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేసి, సేవా కార్యక్రమం నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉంది. ఈ కార్యక్రమానికి ముందుకు వచ్చి పేద కుటుంబాలకు అండగా నిలిచిన మొహమ్మద్ యాకూబ్ మరియు పాల్గొన్న నాయకులందరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు. జన్మదిన వేడుకలు కేవలం సంబరాలకే పరిమితం కాకుండా, పేదలకు సహాయం చేయడం, అవసరంలో ఉన్నవారికి అండగా నిలవడం వంటి సేవా కార్యక్రమాల ద్వారా నిర్వహించడం అభినందనీయం. సమాజంలోని ప్రతి ఒక్కరూ తమకు చేతనైన సహాయం అందిస్తూ మానవత్వాన్ని చాటుకోవాలని భవిష్యత్తులోనూ ప్రజాసేవా కార్యక్రమాలు కొనసాగించాలని ఆకాంక్షిస్తున్నాను" అని తెలిపారు. ఈ సందర్భంగా మొహమ్మద్ యాకూబ్ మాట్లాడుతూ, తోటకూర వజ్రేష్ యాదవ్ గారు నిండు నూరేళ్ళు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని, మరిన్ని ఉన్నత స్థానాలను అధిరోహిస్తూ ప్రజలకు మరింత సేవ చేయాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో బోడుప్పల్ మాజీ అధ్యక్షులు పోగుల నరసింహ రెడ్డి, చెంగిచర్ల డివిజన్ అధ్యక్షులు పోగుల దిలీప్ రెడ్డి, బోడుప్పల్ డివిజన్ అధ్యక్షులు బొమ్మక్ కళ్యాణ్, చెంగిచర్ల డివిజన్ ప్రధాన కార్యదర్శులు కుర్రి మహేష్, ఆసర్ల బీరప్ప, మేకల శ్రీనివాస్ గౌడ్, సింగిరెడ్డి రాజు రెడ్డి, కార్యదర్శి గడ్డం యాదగిరి, మేడ్చల్ నియోజకవర్గ మైనారిటీ ప్రధాన కార్యదర్శి ముస్తాక్, చెంగిచర్ల డివిజన్ మైనారిటీ వైస్ ప్రెసిడెంట్ ఇంతియాజ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.



# దేవేందర్‌నగర్‌లో వైభవంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

### అమ్మవారి మండపం వద్ద మంగళహారతులు..
### పాల్గొన్న మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్,కొత్త కిషోర్ గౌడ్



**బోడుప్పల్-జనంసాక్షి :** బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని దేవేందర్‌నగర్ కాలనీలో వైష్ణవి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి మండపం వద్ద మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు,మంగళహారతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్,మేడ్చల్ బీబ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్‌లు పుష్పాలతో అలంకరించిన అమ్మవారిని దర్శించుకుని లోకకళ్యాణం,కుటుంబాల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని ప్రార్థించారు.నవరాత్రి ఉత్సవాలతో కాలనీలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.అమ్మవారి నామస్మరణతో పరిసరాలు మార్మోగాయి.ఈ వేడుకలు మహిళల్లో భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు కాలనీవాసుల మధ్య ఐక్యతను చాటుతున్నాయని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో మరాటి మల్లేష్,మరాటి మత్స్యగిరి,దయ్యాల అలివేలు, వైష్ణవి యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు కుక్కల రాజు,కుక్కల స్వామి,బిక్షపతి,సాయి కిరణ్, వినోద్,కిరణ్,రాజు యాదవ్,బాలు, చంద్,మరాటి యశ్వంత్,లక్కీ నాని,మణి,శశి,సాయి కుమార్, నవీన్,సాయి,చరణ్,ఓంకార్, మహేష్,ఉపేందర్,ప్రణయ్,మరాటి సాయితేజ,భారత్,కుక్కల రాజమ్మ, అలివేలు,పద్మతో పాటు యూత్ అసోసియేషన్ సభ్యులు, మహిళలు,యువత, భక్తులు పాల్గొన్నారు.

# నేచురల్ డైమండ్ బ్రాండ్ 'జూరి' ప్రారంభం

### రాబోయే ఏడాది కాలంలో దేశవ్యాప్తంగా 25 స్టోర్ల ఏర్పాటు లక్ష్యం

**హైదరాబాద్, అక్టోబర్ 18 (జనంసాక్షి) :** వజ్రాభరణాలకు ప్రసిద్ది చెందిన నేచురల్ డైమండ్ జ్యువెలరీ బ్రాండ్ 'జూరి' మొట్టమొదటి రిటైల్ అవుట్లెట్ను రాజ్ భవన్ రోడ్లో వ్యవస్థాపకులు సాయి వినీత్, మహేష్ చౌదరి, అంకుష్ సురానా ప్రారంభించారు. ఈ సందర్భంగా జూరి వ్యవస్థాపకుడు మహేష్ చౌదరి మాట్లాడుతూ రాబోయే ఏడాది కాలంలో దేశవ్యాప్తంగా 25 స్టోర్లను ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇందులో భాగంగా రాబోయే మూడు నెలల్లో హైదరాబాద్లో నాలుగు అవుట్లెట్లను ప్రారంభించనున్నామని చెప్పారు. వినియోగదారుల ఆకాంక్షలు, ప్రాధాన్యతలను ప్రతిబింబించేలా ఈ షోరూమ్ను రూపొందించామన్నారు. ఇందులో వీఐపీ లాంజ్ కూడా ఉందన్నారు. రిటైల్ నెట్వర్క్ను విస్తరిస్తున్న క్రమంలో రాబోయే అవుట్లెట్లలో కూడా ఇదే డిజైన్ విధానాన్ని కొనసాగిస్తామన్నారు. జూరి ఫ్యాషన్ జ్యువెలరీ నిత్య జీవితం కోసం రూపొందించబడిందని చెప్పారు. ట్రెండీ, సమకాలీన డిజైన్లతో పాటు బహుముఖ వినియోగానికి అనువుగా ఉంటాయన్నారు. ఆఫీస్ పని, వ్యాయామం, డిన్నర్లు, సినిమా నైట్లు ఇలా ప్రతి సందర్భానికి, జీవనశైలికి మా ఆభరణాలు చక్కగా సరిపోతాయని తెలిపారు. ఇది మొట్టమొదటి రిటైల్ అవుట్లెట్ అన్నారు. రాబోయే ఏడాది కాలంలో దేశవ్యాప్తంగా 25 స్టోర్లను ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ఉన్నామన్నారు.




ఈ సందర్భంగా జూరి వ్యవస్థాపకుడు సాయి వినీత్ మాట్లాడుతూ.. నాణ్యత, సమకాలీన డిజైన్, పారదర్శకతను వినియోగదారులకు ఉపయోగపడే ప్రయోజనాలతో మిళితం చేస్తూ సహజ సిద్ధమైన డైమండ్ ఆభరణాలను రోజువారీ జీవితంలో అంతర్భాగం చేయడంపై దృష్టి సారిస్తున్నామన్నారు. రెండో స్టోర్ దీపావళికి ముందే కొంపల్లిలో ప్రారంభించనున్నామన్నారు. ఆ తర్వాత హైదరాబాద్ అంతటా, దేశవ్యాప్తంగా విస్తరించాలని యోచిస్తున్నామన్నారు. జూరి వ్యవస్థాపకుడు అంకుష్ సురానా మాట్లాడుతూ ఒక్కసారి లావాదేవీలకే పరిమితం కాకుండా, దీర్ఘకాలిక సంబంధాలను పెంపొందించే ఉద్దేశంతో రూపొందించిన 'కస్టమర్-కేర్ ప్రోగ్రామ్' జూరికి ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందన్నారు. జూరి సోమాజిగూడ అవుట్లెట్ ఫ్రాంచైజ్ భాగస్వాములు శ్రీధర్ బొనాల, చంద్రహాస్ ఇన్నమూరి, సురేష్ కుమార్ ఎన్నమూరి మాట్లాడుతూ 'జూరి' సమకాలీన జీవనశైలి డిజైన్లను సహజ సిద్ధమైన వజ్రాలు, అసలైన రత్నాలు, నాణ్యమైన బంగారు ఆభరణాలతో మిళితం చేస్తుందన్నారు. వివిధ రకాల శైలులు, ప్రాధాన్యతలు, సందర్భాలకు అనుగుణంగా 18 క్యారెట్లు, 14 క్యారెట్లు, 9 క్యారెట్లలో బీఐఎస్-హాల్మార్క్ బంగారు ఆభరణాలు, ఐజీఐ-ధృవీకృత డైమండ్ ఆభరణాలు అందిస్తున్నామన్నారు.







# అమ్మ వారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలి

### మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి

### ఘనంగా తులజా శ్రీ యూత్ అసోసియేషన్ సభ్యులు నెలకొల్పిన అమ్మ వారికి భక్తిశ్రద్ధలతో పూజలు

**కాప్రా, అక్టోబర్ 18 (జనంసాక్షి) :** శరన్నరాత్రి ఉత్సవాల్లో భాగంగా కుషాయిగూడ డివిజన్ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి కాలనీ లో తులజా శ్రీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెలకొల్పిన దుర్గా మాతా అమ్మవారికి 8వ రోజు ఆదివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు పాల్గొని అమ్మ వారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తులజా శ్రీ అసోసియేషన్ సభ్యులు మైనంపల్లి ని శాలువా తో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మైనంపల్లి మాట్లాడుతూ అమ్మ వారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ బీ బ్లాక్ అధ్యక్షులు వెంకటేష్ యాదవ్, బీకే శ్రీనివాస్, కాంగ్రెస్ మౌలాలి డివిజన్ అధ్యక్షులు పోతుల వినోద్ యాదవ్, ప్రవీణ్, చెన్నారెడ్డి, తులజా శ్రీ యూత్ అసోసియేషన్ సభ్యులు అఖిల్, అభి, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## ముప్పా రామారావు ఆధ్వర్యంలో దేవీ నవరాత్రి ఉత్సవాలకు విరాళాలు

### పలు కాలనీల్లో దుర్గాపూజల్లో పాల్గొన్న రామారావు





**కీసర, అక్టోబర్ 18 (జనంసాక్షి) :** దేవీ నవరాత్రి ఉత్సవాలు భక్తి భావాన్ని, ఆధ్యాత్మిక చింతనను పెంపొందించడంతో పాటు ప్రజల్లో ఐక్యతను చాటుతాయని దమ్మాయిగూడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముప్పా రామారావు అన్నారు. దేవీ నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు ముప్పా రామారావు ఆర్థిక సహకారం అందించారు. సమ్మిరెడ్డి, ఆర్‌బీ రమేశ్‌తో కలిసి పలు కాలనీల్లో నిర్వహించిన దుర్గాపూజ కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారి ఉత్సవాలకు విరాళాలు అందజేశారు. బాలాజీనగర్ కాలనీలోని శశాంక్ ఎన్‌క్లేవ్ గేట్ ఎదురుగా 9వ వార్డులో నిర్వహిస్తున్న ఉత్సవాలకు రూ.15,116, సాయిశ్రీనివాస్ నగర్ కాలనీ 15వ వార్డులో రూ.10,116, కాప్రాలోని పద్మశాలి టౌన్‌షిప్‌లో రూ.5,116 చొప్పున విరాళాలు అందించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ.. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఉత్సవాల నిర్వహణకు తన వంతు సహకారం అందించడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు.దేవీ నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు సహకారం అందించిన ముప్పా రామారావుకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

## తాండూర్ బిగ్ బాష్ లీగ్‌లో
# బిఎస్ఆర్ జట్టు జయకేతనం

### విజేతలకు బుయ్యని శ్రీనివాస్ రెడ్డి ఘన అభినందనలు
### క్రీడాకారుల విజయంతో తాండూర్‌కి గర్వకారణం



**తాండూరు అక్టోబర్ 18 (జనంసాక్షి) :** తాండూర్ పట్టణం లోని జూనియర్ కళాశాల ప్రాంగణం లో నిర్వహిస్తున్న తాండూర్ బిగ్ బాష్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌లో బిఎస్ఆర్ జట్టు విజయం సాధించడం పట్ల ఆర్బిఎల్ సీఈఓ సీనియర్ కాంగ్రెస్ నాయకులు బుయ్యని శ్రీనివాస్ రెడ్డి హర్షం వ్యక్తం చేస్తూ జట్టు సభ్యులకు అభినందనలు తెలిపారు. క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, ఐక్యత, నాయకత్వ లక్షణాలను పెంపొందించడంతో పాటు శారీరక దృఢత్వానికి దోహదపడతాయని శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడాస్ఫూర్తితో ముందుకుసాగాలని, యువత క్రీడల్లో మరింతగా రాణించాలని ఆకాంక్షించారు. తాండూర్ ప్రాంతంలో ఇలాంటి క్రీడా పోటీలు నిర్వహించడం ద్వారా స్థానిక యువతలో ప్రతిభను వెలికితీయడానికి, స్నేహభావాన్ని పెంపొందించడానికి మంచి అవకాశం లభిస్తుందని తెలిపారు. భవిష్యత్తులోనూ క్రీడాకారులు మరిన్ని విజయాలు సాధిస్తూ తాండూర్‌కి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

**కొకుట్ల అనంత్‌రెడ్డి ఆధ్వర్యంలో..**

# అంగరంగ వైభవంగా బతుకమ్మ సంబరాలు

- వేడుకల్లో పాల్గొన్న హరీశ్‌రావు, మల్లారెడ్డి తదితర ప్రముఖులు
- అనంత్‌రెడ్డి పుట్టినరోజు శుభాకాంక్షల వెల్లువ
- నాగారం శిల్పనగర్‌లో అట్టహాసంగా సంబరాలు
- మధుప్రియ పాటలతో ఉర్రూతలూగిన మహిళలు







**కీసర, అక్టోబర్ 18 (జనంసాక్షి)**

మాజీ కౌన్సిలర్ కొకుట్ల అనంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నాగారం డివిజన్ శిల్పనగర్‌లో బతుకమ్మ సంబరాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంత్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా నిర్వహించిన ఈ వేడుకలకు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు, మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితర ప్రముఖులు హాజరై అనంత్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వేలాది మంది మహిళలు పాల్గొనడంతో ప్రాంతమంతా పండుగ వాతావరణం నెలకొంది.

**పూల పండుగకు మహిళల సందడి**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలు సంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి, వాటి చుట్టూ చేరి పాటలు పాడుతూ ఆడిపాడారు. తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని, సాంస్కృతిక వైభవాన్ని చాటుతూ ఉత్సాహంగా సంబరాల్లో పాల్గొన్నారు. మహిళల కోలాహలంతో శిల్పనగర్ సందడిగా మారింది. బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని, ఇలాంటి వేడుకలు భావితరాలకు మన వారసత్వాన్ని పరిచయం చేస్తాయని నాయకులు పేర్కొన్నారు. అనంత్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు, బతుకమ్మ సంబరాలు ఒకేసారి జరగడంతో కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణ ఏర్పడింది.

**మధుప్రియ పాటలతో బతుకమ్మ వేడుకలకు కళ**

బతుకమ్మ సంబరాల్లో ప్రముఖ జానపద గాయని మధుప్రియ పాల్గొని సందడి చేశారు. తన జానపద, బతుకమ్మ గీతాలతో మహిళలను అలరించారు. ఆమె పాటలతో వేడుకల్లో ఉత్సాహం నెలకొంది. మహిళలు ఆనందోత్సాహాల మధ్య బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నారు. ఈ వేడుకల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి కొకుట్ల అనంత్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ వేడుకల్లో మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత, మెదక్ మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి డివిజన్ పరిధి లో వివిధ కాలనీల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.





# ధీరవ్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రికి శుభాకాంక్షలు

సామల శ్రీనివాస్ రెడ్డి

**కీసర, అక్టోబర్ 18 (జనంసాక్షి) :** ధీరవ్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి కి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సామల శ్రీనివాస్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. కుషాయిగూడలో ఏర్పాటు చేసిన ధీరవ్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రారంభోత్సవ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ






అధ్యక్షులు, తోటకూర వజ్రేష్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మెడికల్ డైరెక్టర్ రవి వర్మ, మేనేజింగ్ డైరెక్టర్ దీప్తి సంగరాజు మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పరమేశ్వర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ శ్రీదేవి యాదవ్, పాండాల యాదగిరి గౌడ్, యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు సుమేశ్ తదితరులు పాల్గొన్నారు.

# సూరజ్‌నగర్ కాలనీలో కొత్త కిషోర్ గౌడ్ మార్నింగ్ వాక్

**మెరుగైన మౌలిక వసతుల కోసం కొత్త కిషోర్ గౌడ్ నిరంతర కృషి**

**నూతన సీసీ రోడ్లు, నూతన డ్రైనేజీ ఏర్పాటు కోసం ప్రత్యేక చర్యలు**

**బోడుప్పల్-జనంసాక్షి :** మల్కాజ్‌గిర మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని సూరజ్ నగర్ కాలనీలో మేడ్చల్ జిల్లా బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్ కాలనీవాసులతో కలిసి మార్నింగ్ వాక్ నిర్వహించారు. కాలనీవాసుల సమస్యలను ప్రత్యక్షంగా అడిగి తెలుసుకున్నారు. కాలనీలో మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తున్నానని, నూతన సీసీ రోడ్లు, డ్రైనేజీల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని కొత్త కిషోర్ గౌడ్ అన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుంటూ, కాలనీ అభివృద్ధికి నిరంతరం







సహకరిస్తున్న కిషోర్ గౌడ్ కు కాలనీ వాసుల తరపున అధ్యక్షుడు రవిచంద్ర ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బోడుప్పల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ పడతం లోకేష్ ,సూరజ్ నగర్ కాలనీ జనరల్ సెక్రెటరీ కపిల్, ట్రెజరర్ జగదీష్, రచ్చ శ్రీనివాస్, దేవేందర్, ద్వారకా నగర్ కాలనీ అధ్యక్షుడు బాలరాజ్, మాజీ అధ్యక్షుడు బండి సురేష్, కిషోర్ యాదవ్, కాలనీ అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

# దాతల సేవలు అభినందనీయం

**మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి**

**రాంపల్లి ఆర్టీసీ కాలనీలో దాతల వివరాలతో శిలాఫలకం ఏర్పాటు**



**కీసర, అక్టోబర్ 18 (జనంసాక్షి) :** కాలనీ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల నిర్వహణలో దాతల సహకారం ఎంతో కీలకమని నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. నాగారం డివిజన్ పరిధిలోని రాంపల్లి ఆర్టీసీ కాలనీలో ఆర్టీసీ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. కాలనీ, సంఘం అభివృద్ధికి విరాళాలు అందించిన దాతల పేర్లు, వారు ఇచ్చిన విరాళాల వివరాలను శిలాఫలకంపై పొందుపరచడం అభినందనీయమని చంద్రారెడ్డి పేర్కొన్నారు. దాతల సహకారం కాలనీ అభివృద్ధికి దోహదపడటంతోపాటు, ఇతరులకు స్ఫూర్తినిస్తుందన్నారు. కాలనీ మరింత అభివృద్ధి చెందాలంటే ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని, పరస్పర సహకారం, ఐకమత్యంతో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాగారం మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మల్లేష్ యాదవ్, అన్నంరాజు సురేష్, ఆర్టీసీ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, మురళీధర్, శంకర్ రావు, శ్రీనివాస్ నేత, దేవేందర్ రెడ్డి కాలనీవాసులు పాల్గొన్నారు.



# ఎండమూరి కాలనీలో సీసీ రోడ్ల పనులను ప్రారంభించిన కొలన్ హనుమంత్ రెడ్డి

**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 18 (జనంసాక్షి)**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం - మహాదేవపురం డివిజన్ (277వ డివిజన్): ఎండమూరి కాలనీలో సిఎంసి నిధుల ద్వారా రూ.60 లక్షల వ్యయంతో మంజూరైన సీసీ రోడ్లను కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా హనుమంత్ రెడ్డి మాట్లాడుతూ, కాలనీల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం, ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడం కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులకు ప్రాధాన్యతనిస్తూ, కాలనీల సమగ్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా అభివృద్ధి ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని తెలిపారు ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు సిద్దనోళ్ల సంజీవరెడ్డి, కాలనీ ప్రెసిడెంట్ సుమన్, భీమ్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, అంజి రెడ్డి, చంద్రశేఖర్, రమేష్ రెడ్డి, మైనారిటీ నాయకులు షఫీ, ఫరీనా ఖాన్, గఫర్ రహీమ్, ఖలీమ్, శ్రీలత తదితర కాలనీ సభ్యులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



# పాల్మాకులలో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

**శంషాబాద్, అక్టోబర్18 (జనంసాక్షి)** శంషాబాద్ మండలం పాల్మాకుల గ్రామంలో సర్పంచ్, శంషాబాద్ సర్పంచుల సంఘం అధ్యక్షుడు కొట్టూరి కోటేశ్వర్ గౌడ్ ఆధ్వర్యంలో సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు వివిధ రకాల పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మలతో తెలంగాణ సంప్రదాయ పద్ధతిలో ఆటపాటలతో సందడి చేస్తూ సంబరాలు జరుపుకున్నారు. అనంతరం బతుకమ్మలను నిమజ్జనం చేసేందుకు అవసరమైన ఏర్పాట్లతో పాటు మహిళలకు తాగునీటి సౌకర్యాన్ని సర్పంచ్ కోటేశ్వర్ గౌడ్ కల్పించారు.

# దుర్గాదేవిని దర్శించుకున్న రామకృష్ణారెడ్డి



**రాజేంద్రనగర్, అక్టోబర్18(జనం సాక్షి) :** శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మణికొండ డివిజన్ పరిధిలోని మణికొండ క్వార్టర్స్ వద్ద ఏర్పాటు చేసిన మండపంలో దుర్గాదేవిని మాజీ కౌన్సిలర్ రామకృష్ణారెడ్డి దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు బుద్దోలు శ్రీరాములు, జి. శ్రవణ్, ఉత్సవ నిర్వాహకులు పాల్గొన్నారు.

# నార్సింగ్‌లో ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు



**రాజేంద్రనగర్, అక్టోబర్ 15 (జనంసాక్షి) :** నార్సింగ్ గ్రామంలో డివిజన్ అధ్యక్షుడు క్యాతం అశోక్ యాదవ్ ఆధ్వర్యంలో సద్దుల బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి సంప్రదాయబద్ధంగా ఆడిపాడారు. ఈ బతుకమ్మ వేడుకల్లో మాజీ మహిళా కౌన్సిలర్లు, నార్సింగి ఏఎంసీ చైర్మన్ కోట వేణు గౌడ్, స్థానిక నేతలు జల్లి వెంకటేష్ ముదిరాజ్, జల్లి రాజీవ్ గాంధీ ముదిరాజ్ గ్రామస్తులు పాల్గొన్నారు.

# లక్ష్మమ్మ దేవాలయంలో ఘనంగా బతుకమ్మ ఉత్సవాలు



**రాజేంద్రనగర్, అక్టోబర్15(జనంసాక్షి) :** నార్సింగి గ్రామంలోని లక్ష్మమ్మ దేవాలయంలో బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. గ్రామ మాజీ సర్పంచ్ క్యాతం ప్రసన్న అశోక్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో మహిళలు, భక్తులు పాల్గొని బతుకమ్మ సంబరాలను ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు.

# వెస్ట్ హనుమాన్ నగర్‌లో పారిశుధ్య సిబ్బందికి వస్త్రాల పంపిణీ

## సిబ్బంది సేవలు అభినందనీయం : కీర్తన్ రెడ్డి



**బోడుప్పల్-జనంసాక్షి :** దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని వెస్ట్ హనుమాన్ నగర్ కమ్యూనిటీ ఆధ్వర్యంలో కాలనీ పరిశుభ్రత కోసం నిరంతరం శ్రమిస్తున్న పారిశుధ్య సిబ్బందికి కాలనీ అధ్యక్షుడు పులకండ్ల కీర్తన్ రెడ్డి వస్త్రాలను అందజేసి ఘనంగా సత్కరించారు. కాలనీ పెద్దలు,నివాసితుల సమక్షంలో నిర్వహించిన ఈ కార్యక్రమం పండుగ వేళ సేవాభావానికి,మానవతా విలువలకు ప్రతీకగా నిలిచింది. ఈ సందర్భంగా కీర్తన్ రెడ్డి మాట్లాడుతూ కాలనీలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ప్రజారోగ్య పరిరక్షణలో పారిశుధ్య సిబ్బంది పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఎండ,వాన అనే తేడా లేకుండా నిరంతరం శ్రమిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతున్న వారి సేవలు అభినందనీయమన్నారు. సమాజ ఆరోగ్యాన్ని కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తున్న పారిశుధ్య కార్మికుల కృషిని గుర్తించి,వారికి తగిన గౌరవం ఇవ్వడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. పండుగ వేళ పారిశుధ్య సిబ్బందికి వస్త్రాలు అందజేసి సత్కరించడం ద్వారా వారి సేవలకు కృతజ్ఞతలు తెలియజేయడంతో పాటు వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని వివరించారు. సమాజంలో ప్రతి ఒక్కరి సేవకు తగిన గుర్తింపు,గౌరవం లభించాలని ఆకాంక్షించారు. కాలనీ అభివృద్ధితో పాటు పరిశుభ్రతను కాపాడటంలో నివాసితులందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి సహకరించిన కాలనీ పెద్దలు,నివాసితులకు కాలనీ అధ్యక్షుడు పులకండ్ల కీర్తన్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కాలనీ ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ ప్రధాన కార్యదర్శి గాలయ్య, కాలనీ వాసులు దామోదర్ రెడ్డి,యాది రెడ్డి,శ్రీనివాస్ గుప్తా, దానగళ్ల ఎల్లం, డి.పి.రావు, ప్రసాద్, బద్దం రవి,నగేష్ యాదవ్, సుధాకర్ రెడ్డి, ప్రవీణ్, వార్డు ఆఫీసర్ సుధాకర్ పాల్గొన్నారు.

# దివ్యాంగురాలికి రూ.50 వేల ఆర్థిక సాయం

- ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్యే బీఎంఆర్
- దివ్యాంగుల వాహనం కొనుగోలుకు చాకలి పుష్పలత కుటుంబానికి అండ
- బండమీదిపల్లి పర్యటనలో ఇచ్చిన హామీని నెరవేర్చిన తాండూరు ఎమ్మెల్యే



**పెద్దేముల్ అక్టోబర్ 18(జనంసాక్షి) :** ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి,మానవతా దృక్పథంతో దివ్యాంగురాలికి అండగా నిలిచారు. ఎమ్మెల్యే ఎలక్షన్ పర్యటనలో భాగంగా పెద్దేముల్ మండలం బండమీదిపల్లి గ్రామ పర్యటన సందర్భంగా చాకలి పుష్పలత కుటుంబానికి ఇచ్చిన హామీ మేరకు, దివ్యాంగుల వాహనం కొనుగోలు కోసం రూ.50,000 ఆర్థిక సహాయం అందించారు. గతంలో గ్రామ పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యే బీఎంఆర్.. చాకలి పుష్పలత కుటుంబం ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. దివ్యాంగుల ప్రయాణ అవసరాల కోసం వాహనం కొనుగోలు చేయాల్సిన పరిస్థితిని గుర్తించి, ఆర్థిక సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు. తాజాగా ఆ హామీని కార్యరూపంలో పెట్టి బాధిత కుటుంబానికి చేయూతనందించారు. కష్టాల్లో ఉన్న వారికి అండగా నిలవడం, అవసరమైన సమయంలో సహాయం అందించడం తన బాధ్యతగా భావిస్తున్న ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి,ప్రజా సేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ, అర్హులైన వారికి సహాయం అందించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు జాదవ్ ధారాసింగ్ నాయక్, తట్టేపల్లి సొసైటీ ఛైర్మెన్ పి.మహిపాల్ రెడ్డి, వైస్ ఛైర్మెన్ బండమీదిపల్లి జగన్,పెద్దేముల్ మండల కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ తట్టేపల్లి కే.నర్సింహులు,తట్టేపల్లి సర్పంచ్ నారాయణ గౌడ్, మంబాపూర్ శ్రీనివాస్ రెడ్డి,బండమీది పల్లి నర్సింహులు, ఇతర కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# క్రిమినల్ కేసులు చేవెళ్ల బదిలీ చేయడం హర్షనీయం

## కాంగ్రెస్ నాయకులు గోపికృష్ణారెడ్డి



**మొయినాబాద్ అక్టోబర్ 18 జనం సాక్షి :** మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో క్రిమినల్ కేసులు చేవెళ్ల కోర్టుకు మార్చడంతో ప్రజలకు ఎంతో మేలు కలిగించిందని కాంగ్రెస్ నాయకులు బుర్ర గోపికృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడు తూ ప్రభుత్వం ద్వారా మొయినాబాద్ క్రిమినల్ కేసులు చేవెళ్ల కోర్టుకు బదిలీ ప్రజల్లో ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. ఇప్పటి వరకు మొయినాబాద్కు సంబంధించిన సివిల్, ట్రాఫిక్, ఎక్సైజ్ ఆబ్కారీ కేసులు చేవెళ్ల కోర్టు పరిధిలో ఉండగా కేవలం క్రిమినల్ కేసులు రాజేంద్రనగర్ కోర్టు పరిధిలో ఉండేవన్నారు. ఒకే వ్యక్తికి సంబంధించిన పేరుపేరు కేసుల కోసం రెండు ప్రాంతాలలో కోర్టులు ఉండడంతో ఇబ్బందికరంగా ఉండేదన్నారు. క్రిమినల్ కేసుల కోసం రాజేంద్రనగర్ కోర్టుకు, సివిల్ ఇతర కేసుల కోసం చేవెళ్ల కోర్టుకు వెళ్లాల్సి ఉండేదన్నారు. దీని వల్ల ప్రజలు వేరు వేరు న్యాయవాదులను ఏర్పాటు చేసుకోవడం జరుగుతుందని దీంతో ఆర్థిక భారం పెరగడమే కాకుండా ప్రయాణానికి ఎక్కువ సమయం వెచ్చించాల్సి వృద్ధి అయ్యేదన్నారు. తాజాగా మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని క్రిమినల్ కేసులు చేవెళ్ల కోర్టుకు మార్చడంతో ప్రజలకు ఎంతో ఉరట లభించిందన్నారు. ప్రజా వాణాపై ఆధారపడే వారికి ఇది ఎంతో ప్రయోజనకరంగా ఉందన్నారు. ప్రభుత్వం మంచి ఆలోచనతో ప్రజల సౌకర్యార్థం బస్సులో ప్రయాణించే అవకాశం ఉన్న రాజేంద్రనగర్లో కొనసాగుతున్న కోర్టును చేవెళ్ల కోర్టుకు మార్చడం మొయినాబాద్ ప్రజలకు సంతోషకరంగా ఉపయోగపడుతు oదని ఆయన పేర్కొన్నారు.

# బీజేపీ మేడ్చల్ రూరల్ జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడిగా పవన్ గౌడ్



**శామీర్‌పేట, అక్టోబర్ 18 (జనం సాక్షి) :** బీజేపీ మేడ్చల్ రూరల్ జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడిగా శామీర్‌పేట వాస్తవ్యులు దేశం పవన్ గౌడ్ నియామకం అందుకున్నారు. మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షుడు బుద్ది శ్రీనివాస్, మేడ్చల్ రూరల్ జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు మహేందర్ లు పవన్ గౌడ్ కు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పవన్ గౌడ్ మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ (బీజేపీ) మేడ్చల్ రూరల్ జిల్లాలో ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడిగా తనకు బాధ్యతలు అప్పగించిన సందర్భంగా, తనపై నమ్మకం ఉంచి ఈ అవకాశం కల్పించిన ఎంపీ ఈటల రాజేందర్, మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షుడు బుద్ది శ్రీనివాస్, మేడ్చల్ రూరల్ జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు మహేందర్‌కు హృదయపూర్వక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలియజేశారు. ఈటల రాజేందర్ నాయకత్వ స్ఫూర్తితో, పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి, బీసీ వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తూ, భారతీయ జనతా పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సక్రమం గా నిలబెట్టుకుంటూ, పార్టీ నాయకులు, కార్యకర్తల సహకారంతో ప్రజాసేవలో నిరంతరం ముందుకు సాగుతానని తెలియజేశారు.

# ఉచితంగా, డిజిటల్ మార్కెటింగ్, సైబర్ సెక్యూరిటీ కోర్సులు

- అను అకాడమీ స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్ ప్రారంభం
- అకాడమీ వ్యవస్థాపకులు, డైరెక్టర్ డాక్టర్ పరుశురాం సవారి

**తాండూరు అక్టోబర్ 18(జనంసాక్షి) :** యువతలో నైపుణ్యాలను పెంపొందించి, ఉపాధి అవకాశాలను మెరుగుపరచడంతో పాటు స్వయం ఉపాధి, వ్యాపార రంగాల్లో రాణించేలా తీర్చిదిద్దడమే లక్ష్యంగా తాండూరులో అను అకాడమీ - స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభమైంది. ఆదివారం అకాడమీ వ్యవస్థాపకులు, డైరెక్టర్ డాక్టర్ పరుశురాం సవారి ఆధ్వర్యంలో పట్టణంలోని భద్రప్ప ఆలయం సమీపంలో, కెనరా బ్యాంకు పైన ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ పరశురాం సవారి మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో యువతకు అవసరమైన ఆధునిక సాంకేతిక నైపుణ్యాలను అందించడమే మా లక్ష్యం. మా అకాడమీలో డిజిటల్ మార్కెటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ గ్రాఫిక్ డిజైన్, సైబర్ సెక్యూరిటీ, ఫోటోగ్రఫీ, వీడియో ఎడిటింగ్, టాలీ అండ్ జీఎస్టీ, కెరీర్ గైడెన్స్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ తదితర అంశాల్లో నిపుణులచే శిక్షణ అందించనున్నాం" అని తెలిపారు. ఈ శిక్షణ ద్వారా యువత ఉద్యోగ అవకాశాలు పొందడంతో పాటు సొంత వ్యాపారాలను ప్రారంభించేందుకు ఈ అకాడమీ దోహదపడుతుంది. తాండూరు ప్రాంత యువతకు ప్రత్యేకంగా ఫస్ట్ బ్యాచ్ కోర్సులను ఉచితంగా అందించనున్నాం" అని ఆయన ప్రకటించారు. ఆసక్తి గల యువత ఉచిత కోర్సు రిజిస్ట్రేషన్ కోసం వాట్సాప్ నంబర్ 9849004895 ను సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు.

# మానవతా సేవే నిజమైన సేవ

## పారిశుధ్య కార్మికులకు ఎన్ఎస్ఆర్ ఫౌండేషన్ ఆపన్నహస్తం



**యాచారం, అక్టోబర్ 18(జనం సాక్షి) :** చౌదర్ పల్లి గ్రామంలో గ్రామ పరిశుభ్రత కోసం నిరంతరం శ్రమిస్తున్న పురపాలక సిబ్బంది. పారిశుధ్య కార్మికులకు ఎన్ ఎస్ ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నూతన వస్త్రాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సంస్థ వ్యవస్థాపకులు, అధ్యక్షురాలు నాయిని లహరి నవీన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు అహర్నిశలు కష్టపడే కార్మికుల సేవలను గుర్తించి, వారిని గౌరవిస్తూ నూతన వస్త్రాలు అందించడం అభినందనీయమని ప్రతినిధులు తెలిపారు. సమాజం కోసం శ్రమించే ప్రతి కార్మికుడికి తగిన గౌరవం, గుర్తింపు లభించాలనే స్ఫూర్తితో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా, సేవా కార్యక్రమాలే మార్గంగా ప్రజల మధ్య ఉంటూ వారి అవసరాలను తీర్చడమే ఫౌండేషన్ ముఖ్య ఆశయమని తెలిపారు. సేవలోనే నిజమైన సంతృప్తి, సమాజ అభివృద్ధిలోనే ఆనందం ఉందనే భావనతో సంస్థ ముందడుగు వేస్తోందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కేశ మోని రాజు, ఎన్ఎస్ఆర్ సంస్థ ప్రతినిధులు, గ్రామ పెద్దలు, స్థానికులు పాల్గొన్నారు.



# మాట తప్పని నేత ఎమ్మెల్యే బుయ్యని - ఇచ్చిన మాటకు కట్టుబడి దుర్గమ్మ ఆలయానికి లక్ష

**తాండూరు అక్టోబర్ 18(జనంసాక్షి) :** పట్టణంలోని బసవన్న కట్ట వద్ద ప్రతి ఏటా నిర్వహించే దుర్గమ్మ ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి ప్రతిష్ఠాపనకు, భక్తుల సౌకర్యార్థం షెడ్ (మంటపం) నిర్మాణానికి ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి రూ. 1,00,000 విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీఎంఆర్ మాట్లాడుతూ గత సంవత్సరం దుర్గమ్మ ఉత్సవాల సమయంలో ఇక్కడ శాశ్వత మంటపం నిర్మించాలని ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు. అప్పుడు ఇచ్చిన మాట ప్రకారం ఆదివారం లక్ష రూపాయల విరాళాన్ని అందజేస్తున్నాను. ఆలయ అభివృద్ధికి, భక్తుల సౌకర్యానికి నా వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. ఎమ్మెల్యే సహాయంతో మంటప నిర్మాణం చేపట్టనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఎమ్మెల్యే ఔదార్యానికి కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డితో కాంగ్రెస్ నాయకుల ఆత్మీయ భేటీ



**ధారూర్,అక్టోబర్ 19 (జనంసాక్షి) :** నల్లగొండ జిల్లా మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కావలి కాశీరాం,యువ నాయకుడు యాదయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం కొటిపల్లి ప్రాజెక్టు సందర్శనకు వచ్చిన ఎమ్మెల్యేను కలిసి ఆత్మీయంగా మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి తమ అభిమానం, గౌరవాన్ని వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకుల మధ్య పరస్పర ఆత్మీయత, సత్సంబంధాలకు ఈ భేటీ నిదర్శనంగా నిలిచింది.

# బోడుప్పల్ ఇందిరానగర్‌లో ఘనంగా గణేష్ మండపం ప్రారంభోత్సవం

### స్వర్గీయ బొమ్మక్ గోపీనాథ్ స్మారకార్థం మండపం ఏర్పాటు

**బోడుప్పల్-జనంసాక్షి :** డివిజన్ పరిధిలోని ఇందిరానగర్ కాలనీలో లంబోదర యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపం ప్రారంభోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్వర్గీయ బొమ్మక్ గోపీనాథ్ స్మారకార్థం, బోడుప్పల్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్ బొమ్మక్ కళ్యాణ్ కుమార్, బొమ్మక్ నితీష్ సౌజన్యంతో ఈ మండపాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తిశ్రద్ధలతో స్వామివారిని కొలిచారు. విఘ్నాలు తొలగించి ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు ప్రసాదించాలని గణనాథుడిని ప్రార్థించారు. కాలనీలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, మాజీ అధ్యక్షులు పొగుల నరసింహారెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు బొమ్మక్ రమేష్ హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు గణనాథుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. భక్తి, ఐక్యత, సోదరభావాన్ని పెంపొందించే ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు కాలనీల్లో సామాజిక ఐక్యతకు దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో



బోడుప్పల్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్ బొమ్మక్ కళ్యాణ్ కుమార్, పొగుల దిలీప్ రెడ్డి, బి-బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, మాజీ కార్పొరేటర్ రాసాల వెంకటేష్ యాదవ్, గుర్రాల వెంకటేష్ యాదవ్, జక్క రాములు, బీజేపీ నాయకులు వెంకటేష్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు వెంకటాచారి, పార్టీ కార్యదర్శులు రాములు, శ్రీకాంత్ యాదవ్, ఎస్సీ సెల్ అధ్యక్షులు హరిబాబు, యూత్ కాంగ్రెస్ నాయకులు అరవింద్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఇందిరానగర్ కాలనీ పెద్దలు, మహిళలు, యువకులు, లంబోదర యూత్ అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణేష్ మండపం ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేశారు.

# దుర్గమ్మ కరుణ కటాక్షాలు ప్రజలందరిపై ఉండాలి

**కుత్బుల్లాపూర్ అక్టోబర్ 18 (జనం సాక్షి) :** సీఎంసీ నిజాంపేట్ సర్కిల్ శ్రీనివాస్ నగర్ కాలనీ మాత నల్ల పోచమ్మ తల్లి దేవాలయం (శివశక్తి పీఠం) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నవరాత్రి వేడుకల్లో శక్తి స్వరూపిణి అయిన అమ్మవారు ఆదివారం రోజు దుర్గామాత గా భక్తులను అనుగ్రహించగా, ఈ నవరాత్రి వేడుకలకు బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. అమ్మవారి దయ ఉంటే అన్నీ ఉన్నట్లేనని, శక్తి స్వరూపిణి అయిన అమ్మవారి దయ భక్తులందరిపై సంపూర్ణంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ ధన్ రాజ్ యాదవ్, మాజీ కార్పొరేటర్లు బాలాజీ నాయక్, బొర్రా చందు ముదిరాజ్, మాజీ కో ఆప్షన్ సభ్యులు చంద్రగిరి సతీష్, సీనియర్ నాయకులు ఖాదరయ్య, సాంబశివ రెడ్డి, స్వామి తదితరులు పాల్గొన్నారు.

### కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు

అమ్మవారిని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ సుప్రీత్ రెడ్డి (కాట్రాజ్), కార్యవర్గ సభ్యుల ఆహ్వానం మేరకు ఆలయాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో నాగారం మాజీ మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు బిజ్జ శ్రీనివాస్ గౌడ్, రామక్కపేట రవీందర్ రెడ్డి, నాయకులు మెరుగు శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి నరేష్, కౌకుట్ల రాహుల్ రెడ్డి, భక్తులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## అరుంధతి నగర్ సాయిబాబా ఆలయంలో వైభవంగా అన్నదానం!

### ముఖ్య అతిథిగా హాజరై భక్తులకు అన్నప్రసాదం వితరణ చేసిన ఎంపీ ఈటల రాజేందర్

**జవహర్ నగర్, అక్టోబర్ 18 (జనంసాక్షి):** దేవీ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని జవహర్ నగర్ పరిధిలోని అరుంధతి నగర్ సాయిబాబా దేవాలయంలో అన్నదాన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 2వ డివిజన్



చంద్రపురి కాలనీ, అరుంధతి నగర్‌లోని సీఆర్‌పీఎఫ్ ప్రాంతంలో ఉన్న శ్రీ సాయిబాబా దేవాలయ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమానికి మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలయానికి విచ్చేసిన ఎంపీ ఈటల రాజేందర్‌కు ఆలయ నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన సాయిబాబా స్వామివారిని, దుర్గామాత అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు స్వయంగా అన్నప్రసాదాన్ని వితరణ చేశారు.

ఈ సందర్భంగా ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ జగన్మాత దుర్గాదేవి దివ్య ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. దేవీ నవరాత్రుల సందర్భంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అన్నదానం ద్వారా సేవాభావం, భక్తి భావనతో పాటు సమాజంలో ఐక్యత మరింత బలపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏనుగు సుదర్శన్ రెడ్డి, చంద్రపురి కాలనీ 2వ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు కర్లపూడి జోగారావు, కమలాకర్, మేడ్చల్ రూరల్ జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు మహేందర్ యాదవ్, నాయకులు వేపుల సన్నీ, రఘురాం చారి, మల్లికార్జున గౌడ్, మహేష్ గౌడ్, శివ కేశవ్, వెంకటేష్, రాజు, మహేష్, విజయ్, నర్సింగ్, మొహులా, జి.సి.హెచ్. రాజు, విఘ్నేష్, రాములతో పాటు పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

### భవాని మాత మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ప్రజాప్రతినిధులు



**ముషీరాబాద్, అక్టోబర్ 18 (జనం సాక్షి):** ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని భవాని మాత యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అమ్మవారి మండపాన్ని సందర్శించి, ప్రత్యేక పూజల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. యువ నాయకుడు ముఠా జయసింహ కూడా అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మండపంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ అమ్మవారికి భక్తిప్రపత్తులతో మొక్కులు చెల్లించుకున్నారు. శరన్నవరాత్రుల సందర్భంగా ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్నాయి. అమ్మవారి దర్శనం కోసం భక్తులు తరలివచ్చారు. నిర్వాహకులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ఎం. రాకేష్ కుమార్, మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్ దంపతులు, కరీక కిరణ్, పున్న సత్యనారాయణ, పోతుల శ్రీకాంత్, శ్యామ్ ముదిరాజ్, విశ్వనాథ్ ముదిరాజ్, రాజేశం, సౌందర్య, దుర్గతో పాటు మహిళా భక్తులు, అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## చేవెళ్ల రచ్చబండ దుర్గామాత ఆలయంలో ఘనంగా మహా చండీయాగం

**చేవెళ్ల, అక్టోబర్ 18 (జనంసాక్షి)**

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చేవెళ్ల రచ్చబండలోని దుర్గామాత అమ్మవారి ఆలయంలో దుర్గాష్టమి సందర్భంగా మహా చండీయాగాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు యాగంలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణం భక్తుల రాకతో సందడిగా మారింది. అమ్మవారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని భక్తులు ప్రార్థించారు.

## పండగల సాయన్న జయంతిని జయప్రదం చేద్దాం

**చేవెళ్ల, అక్టోబర్ 18 (జనంసాక్షి) :** ఈ నెల 22న నిర్వహించనున్న పండగల సాయన్న జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించి జయప్రదం చేయాలని ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ పిలుపునిచ్చారు. శనివారం చేవెళ్ల మండల కేంద్రంలో నిర్వహించిన ముదిరాజ్ సంఘం నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పండగల సాయన్న జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం సంతోషకరమని జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు తలారి మల్లేష్ అన్నారు. జయంతి వేడుకలకు ముదిరాజ్ సోదరులంతా హాజరై విజయవంతం చేయాలని నాయకులు కోరారు. ఈ సమావేశంలో చేవెళ్ల మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు నర్సింహులు, యువజన అధ్యక్షుడు తెలుగు శ్రీనివాస్, ఊరడి నర్సింలు, ఊరడి రాంప్రసాద్, గోపాల్, శంకర్‌పల్లి అధ్యక్షుడు మైసయ్య, షాబాద్ అధ్యక్షుడు లింగం, మొయినాబాద్ నాయకులు యాదయ్య, గోపాల్, వెంకటేష్, జనార్ధన్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు అతీతంగా..కుల సమీకరణాల చుట్టూ రాజకీయం

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి (జనంసాక్షి) :** ఎన్నికలకు ఇంకా రెండేళ్ల సమయం ఉండగానే షాద్‌నగర్ నియోజకవర్గంలో రాజకీయ సమీకరణాలపై చర్చ మొదలైంది. ఇప్పటివరకు కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్‌గా సాగిన రాజకీయాలు.. ఇప్పుడు రెడ్డి వర్సెస్ బీసీ చర్చకు దారితీస్తున్నాయా? పార్టీలకు అతీతంగా నేతల కలయికలు, పరస్పర ప్రశంసలు ఈ ఊహాగానాలకు బలం చేకూరుస్తున్నాయి.

**దర్గాలో కలయిక.. ఆలయంలో పూజలు!**

గత నెలలో మిలాద్ ఉన్ నబీ సందర్భంగా కొత్తూరు మండలంలోని జహంగీర్ పీర్ దర్గాలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చౌల్లపల్లి ప్రతాప్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ మామిడి శ్యాంసుందర్ రెడ్డి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మరోవైపు, ఫరూక్‌నగర్ మండలం ఏలికట్ల భవానీ మాత ఆలయంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, బీఆర్ఎస్ నేత, మాజీ ఎంపీపీ వై. రవీందర్ యాదవ్ పూజలు చేసి పల్లకీసేవలో కలిసి పాల్గొన్నారు. ఈ కలయికలు రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తించాయి.

**ప్రశంసల వెనుక రాజకీయ కోణమా?**

గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరిన చౌల్లపల్లి ప్రతాప్‌రెడ్డి.. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ గెలుపు కోసం ప్రచారం చేశారు. మామిడి శ్యాంసుం



దర్ రెడ్డి కూడా ఆయనకు మద్దతుగా పనిచేశారు. తాజాగా రెడ్డి సేవా సమితి కార్యక్రమంలో సామాజికవర్గ నేతలు ఒకే వేదికపై కనిపించడం చర్చకు మరింత ఆజ్యం పోసింది.

మధురాపురంలో వినాయక నిమజ్జనం సందర్భంగా నిర్వహించిన లడ్డూ వేలంపాటలో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ రెడ్డి.. ప్రతాప్‌రెడ్డిని సౌమ్యుడిగా అభివర్ణించారు. ఆయన ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు కక్ష సాధింపు కేసులు పెట్టించలేదని ప్రశంసిస్తూ, ఆ తర్వాత వచ్చిన నాయకులు చిన్న విషయాలకే కేసులు పెడుతున్నారని విమర్శించారు. ప్రత్యర్థి పార్టీల నేతల మధ్య ఇలాంటి ప్రశంసలు రాజకీయంగా చర్చనీయాంశమయ్యాయి.

**నేతల సాన్నిహిత్యం.. కార్యకర్తల్లో అసంతృప్తి?**

ఎన్నికల సమయంలో ప్రత్యర్థులుగా పోరాడే నాయకులు.. ఆ తర్వాత ఆత్మీయంగా కలిసిమెలిసి కనిపిస్తుండటంతో కార్యకర్తల్లో ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నాయకుల గెలుపు కోసం శ్రమించి, కేసులు, ఇబ్బందులు ఎదుర్కొనే కార్యకర్తలకు ఈ సాన్నిహిత్యం ఎలాంటి సంకేతాలిస్తోంది? తమ రాజకీయ భవిష్యత్తు ఏమిటన్న ఆందోళన కొందరిలో వ్యక్తమవుతోంది. అయితే, నేతల కలయికలే కుల రాజకీయాలకు సంకేతాలని ఇప్పుడే నిర్ధారించలేం. ఇవి వ్యక్తిగత సంబంధాలా? రాజకీయ వ్యూహాల్లో భాగమా? లేక సామాజికవర్గాల ఆధారంగా కొత్త సమీకరణాలకు నాందా? అన్నది తేలాల్సి ఉంది. ఎన్నికలకు రెండేళ్ల ముందే షాద్‌నగర్‌లో మొదలైన ఈ చర్చ.. రానున్న రోజుల్లో ఎలాంటి మలుపు తీసుకుంటుందో వేచి చూడాలి.

# శ్రీ మాతా నిమిషాంబ దేవి ఆలయంలో నిత్య అన్నప్రసాద వితరణ మహాసేవ ప్రారంభం

- దుర్గాదేవి విశేష అలంకరణలో అమ్మవారి దర్శనం..
- ప్రారంభోత్సవంలో పాల్గొన్న వివిధ రాజకీయ పార్టీల నాయకులు

**బోడుప్పల్-జనంసాక్షి :** శ్రీ మాతా నిమిషాంబ దేవి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా దుర్గాదేవి విశేష అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ పవిత్ర సందర్భాన్ని పురస్కరించుకొని అమ్మవారి కృపాకటాక్షాలతో భక్తులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషుల సమక్షంలో శ్రీ మాతా నిమిషాంబ దేవి నిత్య అన్నప్రసాద వితరణ మహాసేవను ఘనంగా ప్రారంభించారు. భక్తులకు ప్రతిరోజూ అన్నప్రసాదం అందించాలనే సంకల్పంతో చేపట్టిన ఈ సేవను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ పార్టీ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, జిల్లా సీనియర్ నాయకుడు, బోడుప్పల్ మాజీ కార్పొరేటర్, మాజీ అధ్యక్షుడు పోగుల నర్సింహారెడ్డి, బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ ,బోడుప్పల్ సర్కిల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డిలు హాజరయ్యారు. స్టీమ్ వంట ప్లాంట్‌ను దానం చేసిన సుబ్రమణ్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు చీరాల నరసింహ, దానగల్ల యాదగిరి, బి బ్లాక్ అధ్యక్షుడు కొత్త కిషోర్ గౌడ్, పోగుల దిలీప్ రెడ్డి,



డివిజన్ అధ్యక్షుడు కళ్యాణ్, బీజేపీ జిల్లా సీనియర్ నాయకుడు సామల పవన్ రెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి గోనె శ్రీనివాస్, తలారి రవి తదితర వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఆలయ చైర్మన్ కామరౌతు వినోద్ కుమార్, సెట్లర్ కళావతి, ప్రధాన కార్యదర్శులు కె. అశోక్ కుమార్, సంగు శ్రీనివాస్, కోశాధికారి ఎన్. రమేష్, రాష్ట్ర నకాష్ సంఘం ప్రధాన కార్యదర్శి కొరిచెర్ల శ్రీనివాస్ రావు కార్యక్రమ ఏర్పాట్లలో పాల్గొన్నారు. ట్రస్ట్ ధర్మకర్తలు బి. హిమచందర్, రామగిరి శ్రీకాంత్, వై. చంద్రశేఖర్, ఎస్. గౌరి శంకర్, డి. నర్సింగ్ రావు, ఎం. శ్రీనివాస్ రావు, ఎం. సాయి బాబా (శ్యామ్), డి. సతీష్, ఎన్. శ్రీకాంత్, ఎన్. రామకృష్ణ, ఎన్. మోహన్, డి. రామకృష్ణ, ఎన్. శ్రీధర్, వెంకట్ రాజారావు, కె. ప్రవీణ్ కుమార్, డి. నరేష్, వై. సత్యనారాయణ పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ చంద్రశేఖర్ శర్మ, అర్చకులు ఉమాకాంత్ శర్మ వేదమంత్రాల మధ్య పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

# శ్రీ లక్ష్మీ గణపతి కాలనీలో ఘనంగా దుర్గాష్టమి అన్నప్రసాద వితరణ

**500 మంది భక్తులకు అన్నప్రసాదం పంపిణీ**

**ఎల్బీనగర్, అక్టోబర్ 18 (జనం సాక్షి):** దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీ లక్ష్మీ గణపతి కాలనీలో అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 500 మంది భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మద్ది శ్రీధర్ రెడ్డి దంపతులు, మద్ది శ్రీకాంత్ రెడ్డి హాజరయ్యారు. వివిధ కాలనీల అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, స్థానిక నివాసితులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు నవీన్ రెడ్డి మాట్లాడుతూ, కార్యక్రమానికి హాజరై సహకరించిన అతిథులకు,



కాలనీల అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులకు, భక్తులకు కృతజ్ఞతలు తెలిపారు. అమ్మవారి సేవలో అందరూ ఐకమత్యంతో పాల్గొనడం సంతోషకరమన్నారు. దుర్గామాత ఆశీస్సులతో ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

# వైభవంగా మహా హోమం

**కొందుర్గులో వైభవంగా దేవి నవరాత్రి ఉత్సవాలు**



**కొందుర్గు జనంసాక్షి:** మండల కేంద్రమైన కొందుర్గులో దేవి నవరాత్రి ఉత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన “మహా హోమం” కార్యక్రమం భక్తుల జయజయధ్వానాల మధ్య శాస్త్రోక్తంగా జరిగింది. ఈ విశేష పూజా కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు, దంపతులు పాల్గొని హోమ గుండం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుల వేద మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల నడుమ లోక కళ్యాణార్థం ఈ మహా హోమాన్ని భక్తిశ్రద్ధలతో జరిపించారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఈరోజు అమ్మవారు శ్రీ దుర్గా దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సర్వాలంకార భూషితయై దర్శనమిచ్చిన దుర్గాదేవిని దర్శించుకోవడానికి కొందుర్గు మండల కేంద్రంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. అమ్మవారి కృపాకటాక్షాలు అందరిపై ఉండాలని భక్తులు ప్రత్యేకంగా ప్రార్థనలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు మరియు పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొన్నారు.



# దుర్గమ్మ” శక్తికి ప్రతిరూపం”

**మాజీ సర్పంచుల నేత కే.రాజిరెడ్డి.**

**దోమ అక్టోబర్ 18 జనం సాక్షి :** దోమ శక్తి కీ ప్రతి రూపం అయినా దుర్గమ్మ ఆశీషులు అందరు పొందాలని దోమ మండల సర్పంచుల సంగం మాజీ అధ్యక్షులు కె రాజిరెడ్డి కోరారు ఆదివారం దోమ మండలం తిమ్మాయ్ పల్లి గ్రామ దుర్గా మాత దగ్గర లివ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు హరిజన సత్తయ్యలి ఏర్పాటు చేసిన అన్న దాన ప్రసాద వితరణ కార్యక్రమం లో పాల్గొని అమ్మ వారి ఆశీషులు పొందారు తొమ్మిది రాత్రులు మహిషాసూరిడీ పై పోరాడి పదో రోజు సంహారింన జ్ఞాపకమే “నవ రాత్రులు” విజయానికి సూచిక గా విజయదశమి అని రాజిరెడ్డి అన్నారు ఈ అన్న దాన కార్యక్రమం కార్యక్రమం నిర్వాహకులను అభినందనలు తెలిపారుఈ కార్యక్రమంలో గ్రామస్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



# బషీరాబాద్‌లో పర్యటించిన మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి

**నీళ్లపల్లిలో నాయకులు, కార్యకర్తలతో భేటీ.. మైల్వార్‌లో దుర్గామాత దర్శనం**

**తాండూరు అక్టోబర్ 18(జనంసాక్షి) :** మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి బషీరాబాద్ మండలంలోని నీళ్లపల్లి, మైల్వార్ గ్రామాల్లో పర్యటించారు. నీళ్లపల్లి గ్రామంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను కలుసుకుని వారితో మాట్లాడారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ కార్యకర్త జగదీష్ జన్మదినాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేసి, ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మైల్వార్ గ్రామంలో ప్రతిష్ఠించిన దుర్గామాత అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి, సీనియర్ నాయకులు మధుసూదన్ రెడ్డి, మధు గౌడ్, సర్పంచులు పాండురంగారెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, వీరయ్య స్వామి, నాయకులు రామకృష్ణ రెడ్డి, గోపాల్ రెడ్డి, వెంకట్ రెడ్డి, తాహెర్, సంజీవ్, బుల్లెట్ శ్రీకాంత్, వేణు, హనుమంత్ రెడ్డి, వెంకట్ రెడ్డి, ఉపసర్పంచ్ రాజు నాయక్, యాకంరి తదితరులు పాల్గొన్నారు.

# తనపై వస్తున్న ఆరోపణలు అవాస్తవం జగన్నాధం గంగయ్య




**హయత్ నగర్, అక్టోబర్ 18 (జనం సాక్షి) :** తనపై కొందరు లేనిపోని ఆరోపణలు చేస్తూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని కాంగ్రెస్ సీనియర్ కార్యకర్త, మనసురాబాద్ ఎరుకల నాంచారమ్మ బస్తీ ఆదర్శనగర్ 2బీహెచ్‌కే అధ్యక్షుడు జగన్నాధం గంగయ్య (సాగర్ గంగయ్య) పత్రికా విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. తన ఎదుగుదలను ఓర్వలేకనే కొందరు ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని ఆయన మీడియాకు విడుదల చేసిన సందేశంలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మధుయాష్కీ గౌడ్ సహకారంతో డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు పొందేందుకు అనేక కార్యాలయాల చుట్టూ తిరిగి ఇబ్బందులు ఎదుర్కొన్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తమ సమస్యపై త్వరితగతిన స్పందన లభించిందని పేర్కొన్నారు. ఈ వ్యవహారానికి సంబంధించి అధికారులను సంప్రదించడంతో పాటు కోర్టులో కూడా కేసు దాఖలు చేసినట్లు ఆయన వెల్లడించారు. అనంతరం అధికారులు విచారణ చేపట్టి తమకు డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు కేటాయించారని తెలిపారు.తనపై వస్తున్న ఆరోపణల్లో వాస్తవాలను గుర్తించాలని, పూర్తి వివరాలు తెలుసుకున్న తర్వాతే స్పందించాలని మీడియా మిత్రులను జగన్నాధం గంగయ్య కోరారు. ఈ సమావేశంలో కండెల మొగులయ్య, సిద్దిని స్వామి, నల్ల కాశయ్య, కండెల వీరయ్య, మహమ్మద్ జాంగిర్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలో భాగంగా దుర్గామాతను ప్రత్యేక పూజలు చేసిన మాజీ ఎంపీపీ ఒగ్గు మల్లయ్య యాదవ్ దంపతులు



**మోమిన్ పేట అక్టోబర్ 18 (జనం సాక్షి) :** దేవి శరన్న రాత్రులు మహోత్సవంలో భాగంగా దుర్గామాత ను ప్రత్యేక పూజలు చేసిన మాజీ ఎంపీపీ ఒగ్గు మల్లయ్య యాదవ్ టీవీ నవరాత్రి ఉత్సవాలు భాగంగా ఆదివారం గ్రామంలో ప్రతిష్టించిన దుర్గామాత విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు వికారాబాద్ నియోజకవర్గం మోమిన్ పేట మండలం లోని మోరంగపల్లి గ్రామంలోలో శ్రీ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలోలి భాగంగా దుర్గామాత దేవాలయం దర్శించుకొని ప్రత్యేక పూజలలో పాల్గొన్న వికారాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ ఎంపీపీ ఉగ్గు మల్లయ్య యాదవ్ ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేశప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని మోమిన్ పేట మండల ప్రజలపై దైవకృప ఎల్లవేళలా ఉండాలని దేవుడిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒగ్గు శ్రీశైలం యాదవ్ శివకుమార్ యాదవ్ గణేష్ అంజయ్య ఆలయ కమిటీ సభ్యులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

### భారత జాతీయ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో

# ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు



**చేవెళ్ల, అక్టోబర్ 18 (జనంసాక్షి):** భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) ఆధ్వర్యంలో చేవెళ్ల మండల కేంద్రంలో సద్దుల బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు వడ్ల మంజుల బతుకమ్మ వేడుకల్లో పాల్గొని తెలంగాణ ప్రజలకు, ముఖ్యంగా ఆడపడుచులకు సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వడ్ల మంజుల మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. ప్రకృతిని పూజిస్తూ, పూలను దేవతగా కొలుస్తూ మహిళలు ఐకమత్యంతో జరుపుకునే ఈ పండుగ తెలంగాణ ప్రత్యేకతను చాటిచెబుతుందని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలోనూ బతుకమ్మ ప్రజలను ఏకం చేయడంలో కీలక పాత్ర పోషించిందని గుర్తుచేశారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగాలని, వారికి సమాన హక్కులు, గౌరవం, భద్రత కల్పించాలని ఆమె పిలుపునిచ్చారు. మహిళా సాధికారత సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. అలాగే ప్రకృతిని పరిరక్షిస్తూ, పర్యావరణానికి హాని కలగకుండా పండుగలను జరుపుకోవాలని సూచించారు. సద్దుల బతుకమ్మ ప్రతి ఇంటా సంతోషాలు నింపాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో లలిత, వెంకటమ్మ, మాధవి, జయమ్మ, స్వరూప తదితరులు పాల్గొన్నారు

## కూకట్‌పల్లిలో ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు

**సద్దుల బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న వడ్డేపల్లి రాజేశ్వరరావు కుటుంబ సభ్యులు**



**కూకట్‌పల్లి, అక్టోబర్ 18(జనంసాక్షి ):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ వేడుకలు కూకట్‌పల్లిలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మహిళలు సంప్రదాయబద్ధంగా రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, ఆటపాటలతో పండుగ సంబరాలను జరుపుకున్నారు. ఈ వేడుకల్లో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు దంపతులు, యామిని పాల్గొని బతుకమ్మ సంబరాల్లో భాగస్వాములయ్యారు. పూల పండుగగా ప్రసిద్ధి చెందిన బతుకమ్మ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ఐక్యతకు, సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలుస్తుందని ఈ సందర్భంగా పండుగ వాతావరణం ప్రతిబింబించింది.

సాంప్రదాయ పాటలు, కోలాటాలు, బతుకమ్మ ఆటలతో వేడుకల ప్రాంగణం సందడిగా మారింది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో బతుకమ్మ పండుగ కీలక పాత్ర పోషిస్తుందని ఈ వేడుకలు చాటిచెప్పాయి.

## శ్రీ లక్ష్మీ గణపతి కాలనీలో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు





**హయత్ నగర్ , అక్టోబర్ 18 ( జనం సాక్షి) :** శ్రీ లక్ష్మీ గణపతి కాలనీలో అధ్యక్షుడు వరకాంతం నవీన్ రెడ్డి ఆధ్వర్యంలో బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ మహిళలు, ఆడపడుచులు రంగురంగుల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ బతుకమ్మ పాటలు ఆలపించారు. ఆటపాటలతో సందడి చేస్తూ ఉత్సవాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. మహిళల కోలాహలం, బతుకమ్మ పాటలతో కాలనీలో పండుగ వాతావరణం నెలకొంది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలు ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు.

సంప్రదాయాలను కాపాడుకుంటూ, ఐకమత్యాన్ని చాటుతూ వేడుకలను విజయవంతంగా నిర్వహించారు. హయత్ నగర్, కుంట్లూర్ రోడ్డు లోని శుభోదయ కాలనీ లో మహిళలు ఘనంగా సద్దుల బతుకమ్మ పండుగను నిర్వహించారు.

## అంత్యక్రియలకు ఆర్థిక సాయం చేసిన సర్పంచ్ బాలప్ప



**కొడంగల్ ,అక్టోబర్ 18 (జనం సాక్షి):** కొడంగల్ నియోజకవర్గం, దుద్యాల మండలం చిల్ముల్ మైలారం గ్రామానికి చెందిన భట్టి లక్ష్మమ్మ మరణించిన విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ బాలప్ప వారి కుటుంబాన్ని పరామర్శించి అంత్యక్రియలకు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయాఆకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మండల ప్రజలకు సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు

### దోమ మండల మాజీ వైస్ ఎంపీపీ మల్లేశం

**దోమ అక్టోబర్ 18 జనం సాక్షి :** తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక అయిన సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకుని లిదోమ మండల మాజీ వైస్ ఎంపీపీ గుర్మిట్కల్ మల్లేశంలి మండల ప్రజలకు ముఖ్యంగా ఆడబిడ్డలకు సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తొమ్మిది రోజుల పాటు తీరొక్క పూలతో గౌరమ్మను పూజించిన ఆడబిడ్డల జీవితాల్లో సద్దుల బతుకమ్మ పండుగ సరికొత్త వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా జరుపుకునే దసరా పండుగ వేళ, మండలంలోని ప్రతి ఇంటా ఆయురారోగ్యాలు, సుఖశాంతులు, సిరిసంపదలు వెల్లివిరియాలని ఆయన కోరుకున్నారు. మండల ప్రజలందరూ ఈ పండుగలను భక్తిశ్రద్ధలతో, సంతోషంగా, మరియు ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని లిదోమ మాజీ వైస్ ఎంపీపీ మల్లేశం ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

## యాచారం మండలంలో వైభవంగా సద్దుల బతుకమ్మ వేడుకలు



**యాచారం, అక్టోబర్ 18(జనం సాక్షి )**

యాచారం మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో సద్దుల బతుకమ్మ వేడుకలను ఆదివారం రాత్రి మహిళలు అత్యంత వైభవంగా నిర్వహించారు. యాచారం మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో ఉదయం నుంచే పండుగ వాతావరణం నెలకొంది. తంగేడు, గునుగు, చామంతి, గులాబీ, బంతి వంటి రంగురంగుల పూలతో మహిళలు బతుకమ్మలను అందంగా తీర్చిదిద్దారు. సాయంత్రం వేళల్లో సాంప్రదాయ దుస్తులు ధరించిన మహిళలు, యువతులు బతుకమ్మలను ఊరేగింపుగా గ్రామాల సమీపంలోని చెరువులు, కుంటల వద్దకు తరలించారు. బతుకమ్మల చుట్టూ తిరుగుతూ జానపద పాటలు పాడుతూ, కోలాటాలు ఆడుతూ ఉత్సాహంగా గడిపారు. అనంతరం గౌరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి, వాయనాలు ఇచ్చిపుచ్చుకున్న తర్వాత బతుకమ్మలను చెరువులలో నిమజ్జనం చేశారు. ఈ వేడుకల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

## బొంరాస్ పేట మండలంలో ఘనంగా సద్దుల బతుకమ్మ సంబురాలు



**బొంరాస్ పేట, అక్టోబర్ 18 (జనం సాక్షి):** మండల కేంద్రంలోని దుర్గామాత ఆలయం, బొట్లవానితండా, దేవులనాయక్ తండాలో ఆదివారం చివరి రోజు సద్దుల బతుకమ్మ సంబురాలు భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా జరిగాయి. తంగేడు,గునుగు, బంతి,చామంతి పూలతో మహిళలు పెద్ద ఎత్తున బతుకమ్మలను ముస్తాబు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో పాటలు పాడుతూ ఆటలు ఆడుతూ సందడి చేశారు. ఈ సందర్భంగా తండాలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా ప్రతి ఏటా బతుకమ్మ పండుగను నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్న ఆచారంగా తండావాసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బాలు నాయక్, మాజీ ఎంపీటీసీ మోతీబాయి,బిఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షులు నెహ్రూ నాయక్, ఉపసర్పంచ్ రవి నాయక్, లక్ష్మణ్ నాయక్,కాలు నాయక్,సుభాష్, రవి నాయక్,వినోద్,రమేష్,సురేష్,నార్య, కిషన్, సునీల్ ,హనుమంతు, లాలు ,అకేష్ నాయక్ ఉన్నారు.

# కమలానగర్‌లో ఘనంగా బతుకమ్మ సంబరాలు

- **తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ**



కాప్రా, అక్టోబర్ 18 (జనం సాక్షి) : తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ఆరాధనకు, పూల వైభవానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలు కమలానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రాంగణంలో ఎల్లాపు సంఘం మహిళా కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహి ంచారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ పాటలు పాడుతూ మహిళలు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎల్లాపు రాష్ట్ర సంఘం అధ్యక్షుడు డాక్టర్ మాదాసు సంజీవరావు ఆయన సతీమణి విజయలక్ష్మితో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎల్లాపు భవన్ ట్రస్ట్ చైర్మన్‌ను ఘనంగా సత్కరించారు. ఎల్లాపు సంఘానికి విశిష్ట సేవలందిస్తూ, భవన నిర్మాణానికి స్థలం, ఇతర సహకారం అందించడంలో కీలకంగా నిలిచిన వారిని సత్కరించడం అదృష్టంగా భావిస్తున్నానని మల్కా రమాదేవి పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో బతుకమ్మ పండుగ కీలక పాత్ర పోషిస్తుందని, మహిళల ఐక్యతకు, సామాజిక బంధాల బలోపేతానికి ఇలాంటి వేడుకలు దోహదపడతాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథులు వీర్ల సుధాకర్ రావు, రాజేశ్వరరావు, రాజేందర్ రావు, పెంచాల దేవేందర్ రావు, రామచంద్రరావుతో పాటు యశోద, వినోద, వసంత, పద్మాదేవేందర్ రెడ్డి, పావని రెడ్డి, రజిత, సురేందర్రావు, తిరుమల ప్రభాకర్, దత్తు, రాఘవరెడ్డి, జనార్దన్ గౌడ్, నవీన్, సహదేవ్, ఎం.ఎన్. చారి, సాంబశివరావు, సీఎన్. రావు, జి.వి. నారాయణ, చిట్టి, రేణుక, సునీత, రాజేందర్ రావు, రాణి, రమ, నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.